తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 వెల: 3 సంపుటి:3 సంచిక: 237

సోమవారం 02, ఫిబ్రవరి 2026

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥


## దేశ ఆర్థిక వ్యవస్థను సుస్థిరం చేసేలా బడ్జెట్

- ఎరువుల రాయితీతో రైతులకు లబ్ది
- బడ్జెట్‌పై కిషన్ రెడ్డి వ్యాఖ్య



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(అక్షరగళం):** దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ముందుకు తీసుకెళ్లేలా బడ్జెట్ రూపకల్పన చేశారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై ఆయన దిల్లీలో విలేకర్లతో మాట్లాడారు. రైతులకు అండగా నిలిచేందుకు ఎరువుల రాయితీని కేంద్ర ప్రభుత్వం పెంచిందని చెప్పారు. ఎరువులపై రాయితీ వల్ల తెలంగాణ రైతులు కూడా లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ గతేడాది కంటే ఈసారి పెరిగిందన్నారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌కు లబ్ధి కలిగే పథకాన్ని కేంద్రం తీసుకొచ్చిందని తెలిపారు. ప్రతి జిల్లాలో ఒక్కో బాలికల హాస్టల్‌ను కేంద్రం ఏర్పాటు చేయనుంది. తెలంగాణలోని మిగతా..2లో


# స్థిరంగా భారతదేశ ఆర్థిక ప్రయాణం




- వికసిత భారత్ దిశగా అడుగులు
- ప్రజల ఆకాంక్షలను ఆచరణలోకి తీసుకొస్తున్నాం
- మూడు కర్తవ్యాలు లక్ష్యంగా సాధనే లక్ష్యం
- ఆత్మనిర్భరత వల్లే 7 శాతం గ్రోత్ రేటు ఆకాంక్ష
- బయో ఫార్మా రంగానికి రూ.10 వేల కోట్లు
- కంటైనర్ నిర్మాణ రంగానికి రూ.10 వేల కోట్లు
- 200 పారిశ్రామిక క్లస్టర్స్ ఆధునీకరణకు చేయూత
- మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల నిర్మాణం
- మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు
- 2026-27 ద్రవ్యలోటు 4.3 శాతంగా అంచనా
- మూలధన వ్యయం రూ.12.20 లక్షల కోట్లు
- రూ.28.70 లక్షల కోట్ల పన్ను వసూళ్లు అంచనా
- 2047 నాటికి సమగ్రాభివృద్ధితో వికసిత్ భారత్ లక్ష్యం
- కేంద్రబడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ ప్రతిపాదనలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి1 (అక్షరగళం):** భారతదేశ ఆర్థిక ప్రయాణం స్థిరంగా సాగుతోందని, యువశక్తి కేంద్రంగా బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వికసిత్ భారత్ దిశగా అడుగులు వేస్తున్నామని, గ్లోబల్ మార్కెట్లతో పోటీ పడుతూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. లోక్ సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 9వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టారు. లోక్ సభలో 2026-27 బడ్జెట్ గురించి నిర్మలా సీతారామన్ ప్రసంగించారు.

కేంద్ర బడ్జెట్.. మూలధన వ్యయం రూ.12.20 లక్షల కోట్లు.. కాగా.. 2026-27 ద్రవ్యలోటు 4.3 శాతంగా అంచనా వేశారు. 2027లో రూ.28.70 లక్షల కోట్ల పన్ను వసూళ్లు అంచనా వేశారు. ప్రభుత్వానికి బాసటగా నిలుస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. మూడు కర్తవ్యాలను లక్ష్యాలుగా ప్రకటించారు. ప్రజల ఆశయాలను అందుకోవడమే తమ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోడీ ఆలోచనలతో ఎన్నో కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలియ జేశారు. ఈ బ్జడెట్ ను యువశక్తి బడ్జెట్‌గా అభివర్ణించారు. ప్రజల ఆకాంక్షలను ఆచరణలోకి తీసుకొస్తున్నామని, రైతులు, దళిత, ఆదివాసీ సమూహాలకు అభివృద్ధి ఫలాలు చేరాలన్నారు. మూడు కర్తవ్యాలను స్ఫూర్తిగా తీసుకుని కర్తవ్యభవన్‌లో రూపొందించిన బడ్జెట్ ఇదంటూ పేర్కొన్నారు.నిర్మాణాత్మక సంస్కరణలతో ఈ కార్యవ్యాలను సాధిస్తామని, ఇది యూనిక్ బడ్జెట్ అని పేర్కొన్నారు. ఆత్మనిర్భరత వల్లే 7 శాతం గ్రోత్ ఉంటుందని అన్నారు. కర్తవ్యం1: సమ్మిళిత ఆర్థిక వృద్ధి. కర్తవ్యం 2: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం 3: సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అని తెలిపారు. బయో ఫార్మా రంగానికి రూ.10 వేల కోట్లు, ఎపి, ఒడిశా, తమిళనాడు, కేరళలో గనుల కారిడార్, మూడు డెడికేటెడ్ కెమికల్ పార్క్‌ల నిర్మాణం చేపడుతామని, ప్రస్తుతమున్న ఎన్ఐపిఇఆర్ఎస్ ఆధునీకరించడంతో పాటు దేశంలో రెండు మిగతా..2లో




## మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుదల

- 140కోట్ల మంది ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం
- బడ్జెట్ ప్రతిపాదనలపై ప్రధాని మోడీ వ్యాఖ్య

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(అక్షరగళం):** కేంద్ర బడ్జెట్ 2026-27 పై ప్రధాని మోదీ స్పందించారు. ఈ పద్దు 140 కోట్ల మంది ఆకాంక్షలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ఇది సంస్కరణల ప్రయాణాన్ని బలోపేతం మిగతా..2లో



## సంక్షోభాలపై దృష్టి పెట్టని బడ్జెట్

- ఎదురుదెబ్బలు తగులుతున్నా ఎదుర్కొనే మార్గం లేదు
- బడ్జెట్ ప్రతిపాదనలపై రాహుల్ విమర్శలు


**న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(అక్షరగళం):** కేంద్ర ప్రభుత్వం ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రధాన ప్రతిపక్ష నేతల పెదవి విరచారు. దేశంలో యువతకు ఉద్యోగాలు లేవు. తయారీ రంగం పతనమవుతోంది. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రపంచ దేశాల నుంచి ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఈ సంక్షోభాల గురించి బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావన లేదు. దేశంలో వాస్తవ సమస్యలను కేంద్రం పట్టించుకోవట్లేదని విపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా మిగతా..2లో



## మహిళలు, యువత, రైతులకు వ్యతిరేకం

- బెంగాల్‌కు కేటాయింపులను పట్టించుకోని కేంద్రం
- బడ్జెట్‌పై మండిపడ్డ మమతా బెనర్జీ


**కోల్‌కతా,ఫిబ్రవరి1(అక్షరగళం):** మహిళలు, యువత, రైతులకు వ్యతిరేకంగా బడ్జెట్ ఉంది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన బడ్జెట్‌తో సామాన్యులకు ప్రయోజనమేమీ లేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. కేంద్ర బ్జడెట్-2026పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వం దేశాన్ని మిగతా..2లో




## రాష్ట్రాలను విస్మరించిన కేంద్ర బడ్జెట్

- కేరళ ఆచుర్వేద రంగానికి దక్కని ప్రోత్సాహకం
- కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ పెదవి విరుపు

2లో



## కేంద్ర పన్నుల్లో వాటా కింద రాష్ట్రానికి పెరిగిన నిధులు

- కేంద్ర బడ్జెట్ ప్రకారం రూ.33,180.78 కోట్లు రాక
- ఆర్థిక సంఘం సిఫారసులతో రూ.1098.90 కోట్ల పెరుగుదల
- రాష్ట్రం హారిజాంటల్ వాటా 2.102 నుంచి 2.174 శాతానికి..

2లో



## తెలంగాణకు నిరాశ మిగిల్చిన బడ్జెట్

- ఆశించిన కేటాయింపులు ఇవ్వని కేంద్రం
- బడ్జెట్ ప్రతిపాదనలపై భట్టి మండిపాటు

**హైదరాబాద్,ఫిబ్రవరి1(అక్షరగళం):** కేంద్ర బడ్జెట్ తెలంగాణను నిరాశకు గురి చేసిందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈసారి బ్జడెట్‌లో ఆశించిన మేరకు కేటాయింపులు ఉంటాయని భావించినా.. ఈ ఏడాది కూడా అదే జరిగిందని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డితో సహా మంత్రులంతా.. ఎంపీల బృందంతో ప్రధానిని, కేంద్ర మంత్రులను అనేక సార్లు కలిశామని అయినా ప్రయోజనం లేదని విమర్శించారు. మూసీ, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణలకు బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని ఆశించామన్నారు. బయోఫార్మాపై ఫోకస్ చేశారని.. దాంట్లో కూడా తెలంగాణను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీఐఎల్ లాంటి కంపెనీని హైదరాబాద్‌లో పెట్టింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనన్న భట్టి.. కెమికల్ పార్క్‌లో కూడా హైదరాబాద్‌కు చోటు దక్కలేదని విమర్శించారు. ఆరెంజ్ ఎకానమీలో హైదరాబాద్ కేంద్రం.. . దానిని కూడా ముంబయికి తరలించారని, తెలంగాణ రాష్ట్రం ఏం తప్పు చేసిందని భట్టి ప్రశ్నించారు. రీజినల్ మెడికల్ హబ్ అని మెన్షన్ చేసినా... అందులో కూడా తెలంగాణ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన కోసం ప్రధాని, కేంద్ర మిగతా..2లో




## వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు

- ఎన్నికల సంఘానికి పెరిగిన కేటాయింపులు
- 25.33 శాతం పెరిగిన నిధుల కేటాయింపు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(అక్షరగళం):** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ఆదివారంనాడు ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఎన్నికల కమిషన్ కు నిధుల కేటాయింపు 25.33 శాతం పెరిగింది. 2025-26లో రూ.304.98 కోట్లుబడ్జెట్‌లో కేటాయించగా, 2026-27 బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని రూ.382.22 కోట్లకు పెంచారు. ఎన్నికల సంఘానికి కేటాయించిన నిధుల్లో రూ.367.69 కోట్లు ఎన్నికల సంబంధిత వ్యయం కాగా, తక్కిన మొత్తాన్ని పరిపాలన, నిర్వహణా ఖర్చులకు మిగతా..2లో

# మావోయిస్టుల పేరిట ఫోన్లను ట్యాపింగ్ చేయించారా?

- ఎన్నికల్లో గెలుపునకు ఆయుధంగా మార్చుకున్నారా?
- రిటైరైన అధికారులను ఎందుకు కొనసాగించారు?
- వ్యాపారుల్ని బెదిరించడం వల్లే ఎన్నికల బాండ్లు వచ్చాయా?
- 'ఎమ్మెల్యేల కొనుగోలు' ఆడియోలు మీకెలా వచ్చాయి?
- మాజీ సీఎం కేసీఆర్‌పై సిట్ అధికారుల ప్రశ్నల వర్షం
- నందినగర్‌లోని ఇంట్లో నాలుగున్నర గంటలు విచారణ
- అవసరమైతే మరోసారి విచారిస్తామని సమాచారం!
- ఆ సమయంలో ఇంట్లోనే కేటీఆర్.. లాయర్లకు అనుమతి నో
- విచారణ అనంతరం సిట్ చీఫ్‌ను కలిసిన దర్యాప్తు బృందం

**హైదరాబాద్, ఫిబ్రవరి1 (అక్షరగళం):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అనధికార, అక్రమ టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్



అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సిట్ అధికారులు ఆదివారం విచారించారు. నందినగర్‌లోని ఆయన నివాసంలో నాలుగున్నర గంటలకు పైగా ఈ విచారణ కొనసాగింది. మిగతా..2లో

# మావోయిస్టుల పేరిట ఫోన్లను ట్యాపింగ్ చేయించారా?

(మొదటి పేజీ తరువాయి)

విచారణలో భాగంగా.. ప్రభుత్వ అధినేతగా మీకు తెలిసే టెలిఫోన్ ట్యాపింగ్ జరిగిందా? మావోయిస్టుల పేరిట కొన్నివేల మంది ఫోన్లను ట్యాపింగ్ చేయించారా? పదవీ విరమణ పొందిన అధికారులను కీలక బాధ్యతల్లో ఎందుకు కొనసాగించారు? పలు ఎన్నికల్లో గెలుపునకు ఫోన్ ట్యాపింగ్ మీకు ఒక ఆయుధంగా మారడం వల్లే దానిని కొనసాగించారా? ఫోన్ ట్యాపింగ్ వల్ల వచ్చిన సమాచారం ఆధారంగా బెదిరింపులకు పాల్పడటంతోనే బీఆర్ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్లు పెద్ద మొత్తంలో వచ్చాయా? అంటూ సిట్ అధికారులు కేసీఆర్‌పై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. సిట్ విచారణ కోసం కేసీఆర్ ఆదివారం ఉదయమే ఎర్రవల్లి ఫామ్‌హౌస్ నుంచి బయలుదేరి నందినగర్‌లోని నివాసానికి చేరుకున్నారు. అయితే కేసీఆర్‌ను సిట్ విచారించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. దీంతో నందినగర్ ప్రాంతంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3గంటలకు విచారణ ప్రారంభించిన అధికారులు.. అందుకు కొద్దిసమయం ముందుగానే అక్కడికి వచ్చారు. కేసీఆర్ నివాసంలోని రెండో అంతస్తులోని ఒక గదిలో విచారణకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకున్నారు. రెండు ట్రంక్ పెట్టెల్లో కేసుకు సంబంధించిన అత్యంత కీలకమైన ఎలకా?ట్రనిక్ సాక్ష్యాధారాలను, కొన్ని రికార్డులను తీసుకుని వచ్చారు. కేసీఆర్ విచారణను ఆసాంతం.. ఆడియో, వీడియో రికార్డింగ్ చేసేలా ఏర్పాట్లు చేశారు. కేసీఆర్ కుమారుడు కేటీఆర్ ను విచారణ సమయంలో ఉండటానికి సిట్ అధికారు లు అనుమతి ఇచ్చారు. ఇంట్లో ఉన్న హరీశ్‌రావు తదితర నేతలను బయటకు పంపేశారు.

కేసీఆర్ న్యాయవాదులను అక్కడికి అనుమతించలేదు. అయితే, న్యాయవాద బృందంలోని రామచంద్రరావును మాత్రం కేటీఆర్‌తో కలిసి ఉండటానికి అనుమతించారు. విచారణ సందర్భంగా సిట్ అధికారులు ప్రధానంగా.. సీఎం ఆదేశాలు కిందిస్థాయికి ఏ విధంగా చేరుతాయనే విషయంపై ఆరా తీసినట్లు సమాచారం. అనధికార, అక్రమ ఫోన్ ట్యాపింగ్‌లో కీలకపాత్ర పో షించిన అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఆయన బృందంలోని ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న ఇచ్చిన వాంగ్మూలాలతోపాటు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు వాంగ్మూలం ఆధారంగా కేసీఆర్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఎవరిపైనిఘా పెట్టాలనే దానిపై తమకు సీఎంవో నుంచి ఆదేశాలు వచ్చేవని రాధాకిషన్‌రావు తన వాంగ్మూలంలో పేర్కొన్న నేపథ్యంలో 'మీరు ఇలాంటి ఆదేశాలు ఇచ్చారా? రాధాకిషన్‌రావుకు మీ ఆదేశాలు ఏ విధంగా అందేవి?' అని సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. అంతేకాకుండా.. రాధాకిషన్‌రావు, ప్రభాకర్‌రావును పదవీ విరమణ తర్వాత కీలక హోదాల్లో కొనసాగించడానికి కారణమేంటని ప్రశ్నించగా.. ఆ నిర్ణయం పోలీసు ఉన్నతాధికారులు తీసుకుంటారని, తాను కాదని కేసీఆర్ బదులిచ్చినట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ వల్ల వచ్చిన సమాచారం ఆధారంగా బెదిరింపులకు పాల్పడటంతోనే బీఆర్ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్లు పెద్ద మొత్తంలో వచ్చాయా? అన్న ప్రశ్నకు.. ఆ విషయాలు తనకు తెలియని, పార్టీకి కోశాధికారి, కార్యనిర్వాహక



అధ్యక్షుడు ఉంటారని కేసీఆర్ చెప్పినట్లు సమాచారం.

### ఆధారాలు చూపించి ప్రశ్నలు.

మావోయిస్టుల పేరిట కొన్నివేల మంది ఫోన్లను ట్యాపింగ్ చేయించారా? అంటూ సిట్ అధికారులు ప్రశ్నించగా.. అనుమతులు ఇచ్చేది తాను కాదని, ట్యాపింగ్‌కు సంబంధించి చట్టబద్ధమైన వ్యవస్థ పనిచేస్తుందని కేసీఆర్ చెప్పినట్లు, రివ్యూ కమిటీ అనుమతు లు ఇస్తుందన్న విషయం మీకూ తెలుసు కదా! అని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అనధికారికంగా, అక్రమ పద్ధతుల్లో నిఘా కొనసాగడం, ఫోన్ ట్యాపింగ్‌కు పా ల్పడటం ప్రభుత్వ అధినేతగా మీకు తెలిసే జరిగిందా? మీ అనుమతి లేకుండా ఇంత విస్తృత స్థాయిలో ఫోన్ ట్యాపింగ్‌కు అధికారులు సాహసిస్తారా? అనే ప్రశ్నలను సైతం సిట్ అధికారులు సంధించినట్లు సమాచారం. అయితే వారు ఎలాంటి ప్రశ్నలు అడిగే అవకాశాలుంటాయనే విషయంపై కేసీఆర్ సుదీర్ఘ కసరత్తు చేసిన తర్వాతే విచారణకు హాజరైనందున.. ఆయన నుంచి ఆశించిన విధంగా సమాధానాలు వచ్చే అవకాశం లేదనే చర్చ పోలీసు వర్గాల్లో సాగుతోంది. ఈ నేపథ్యంలో.. సిట్ అధికారులు పూర్తిస్థాయి సాక్ష్యాలు, డిజిటల్ ఆధారాలు, వాంగ్మూలాలను చూపించి ప్ర శ్నించినట్లు తెలిసింది. ఈ ఆధారాల్లో రాజకీయనేతలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, పారిశ్రామికవేత్తలు, సెలబ్రిటీలకు సంబంధించి ఎస్ఐబీ రూపొందించిన ప్రొఫైల్స్‌లో కొన్నింటిని కేసీఆర్‌కు చూపించినట్లు సమాచారం. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు సంతోషరావు, కేటీఆర్, హరీశ్‌రావును విచారించిన సందర్భం గా సేకరించిన కొన్ని ఆధారాలనూ కేసీఆర్ ముందు ప్రస్తావించినట్లు తెలిసింది.

### ట్యాపింగ్‌ను ఎన్నికల్లో వాడుకున్నారా?

"2018 ఎన్నికల సమయంలో ప్రారంభమైన అనధికార ఫోన్ ట్యాపింగ్ మీకు ఒక ఆయుధంగా మారడం వల్లే ఆ తర్వాత కూడా దీనిని కొనసాగించారా? రిటైరయిన అధికారులను పదవుల్లో ఇందుకే కొనసాగించారా? పార్లమెంట్ ఎన్నికలు, మునుగోడు, హుజూరాబాద్ ఉప ఎన్నికలు, 2023 ఎన్నికల సమయంలో విచ్చలవిడిగా వార్‌రూంలు ఏర్పాటు చేసి అనధికారికంగా వేలాది ఫోన్లు ట్యాపింగ్ చేసిన విషయం మీ ఆదేశాలతోనే జరిగిందా? లేక ఇందులో కేటీఆర్, హరీశ్‌రావు, సంతో?షల పాత్ర ఉందా?" అనే ప్రశ్నలను సైతం సిట్ అధికారులు కేసీఆర్‌కు సంధించినట్లు తెలిసింది. కేసీఆర్ విచారణ కొనసాగుతున్న క్రమంలో దర్యాప్తు తీరును సిట్ చీఫ్, హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ పర్యవేక్షించారు. దర్యాప్తు అధికారులతో ఆయ న ఎప్పటికప్పుడు మాట్లాడుతూ.. కేసీఆర్ ఇస్తున్న సమాధానాలు తెలుసుకుంటూ మరికొన్ని ప్రశ్నలకు సంబంధించి సూచనలు జారీ చేసినట్లు సమాచారం. కాగా, సాయంత్రం 6.30 గంటలకు విచారణ అధికారులు కేసీఆర్‌కు టీ బ్రేక్ ఇచ్చారు. ఆ తర్వాత 7.45 ప్రాంతంలో విచారణ ముగించారు. అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని చెప్పినట్లు తెలిసింది. విచారణ బృందంలో కేసు దర్యాప్తు అధికారి, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, డీఐజీ విజయకుమార్, డీసీపీ నారాయణరెడ్డి, అదనపు ఎస్పీలు కేఎస్ రావు, రవీందర్‌రెడ్డి, ఏసీపీ శ్రీధర్ ఉన్నారు. విచారణ ముగిసిన తర్వాత వారు పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుకుని సిట్ చీఫ్ సజ్జనార్‌కు కేసీఆర్‌ను విచారించిన తీరును వివరించారు. ఇక ఈ కేసులో తుది చార్జిషీట్ దాఖలుకు అవసరమైన సాక్ష్యాధారాలను సిద్ధం చేసుకోవడానికి ముందు మరోసారి కేటీఆర్, హరీశ్‌రావు, సంతోషరావులను సిట్ అధికారులు విచారించవచ్చని తెలుస్తోంది. సిట్ విచారణ అనంతరం కేసీఆర్ బయటకు వచ్చి పార్టీ నేతలు, కార్యకర్తలకు అభివాదం చేశారు. అనంతరం రాత్రి 8.30 గంటల సమయంలో నందినగర్ నివాసం నుంచి బయలుదేరి తిరిగి ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లారు.

### ఎమ్మెల్యేల కొనుగోలు ఆడియో రికార్డులను మీకు ఎవరిచ్చారు?

గతంలో ఎమ్మెల్యేల కొనుగోలుకు సంబంధించి చోటుచేసుకున్న ఫాంహౌస్ వ్యవహారంపైనా కేసీఆర్‌ను సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. "ఈ వ్యవహారం బయటపడిన సమయంలో మీరు విలేకరుల సమావేశం పెట్టి సీఎం హోదాలో కొన్ని ఆడియో రికార్డులను బహిరంగపరిచారు. వాటిని మీకు ఎవరిచ్చారు? ఆ కేసులో నిఘా, ఫోన్ ట్యాపింగ్ కొనసాగించాలని మీరే ఆదేశించారా?" అనే ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది.

# మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుదల

(మొదటి పేజీ తరువాయి)

చేస్తుందని వ్యాఖ్యానించారు. మూలధన వ్యయానికి, వృద్ధికి మధ్య సమతూకం పాటించారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై ప్రశంసలు కురిపించారు. వికసిత్ భారత్ నిర్మాణానికి మార్గనిర్దేశనర చేస్తుందని, ఇది చరిత్రాత్మక బ్జడెట్ అని కొనియాడారు. బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు చేశారు. 2047 మిషన్ లక్ష్యాల అనుగుణంగా ఈ బడ్జెట్ ఉంది. త్వరలో ఇండియా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది' అని చెప్పారు. ప్రభుత్వ సంస్కరణల అజెండాను రీఫామ్ ఎక్స్‌ప్రెస్‌గా పిలిచిన మోదీ ఆ ఎక్స్‌ప్రెస్‌కు బ్జడెట్ కొత్త శక్తిని అందించిందని పేర్కొన్నారు. ఈ సంస్కరణలు యువతకు అద్భుతమైన అవకాశాలు కల్పిస్తాయన్నారు. భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మాత్రమే ఉండిపోవాలని భారతీయులు అనుకోవడం లేదని, సాధ్యమైనంత వేగంగా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇక ఈ పద్దు మహిళా సాధికారతకు నిదర్శనంగా ఉందని, వరుసగా తొమ్మిదిసార్లు దీనిని లోక్‌సభలో ప్రవేశపెట్టి నిర్మలాసీతారామన్ రికార్డు సృష్టించారని ప్రధాని మోదీ కొనియాడారు.

# సంక్షోభాలపై దృష్టి పెట్టని బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఇది దేశంలోని వాస్తవ సంక్షోభాలను పట్టించుకోని బడ్జెట్ అని ఎక్స్ వేదికగా విమర్శలు ఎక్కుపెట్టారు. 'యువతకు ఉద్యోగాలు లేవు, కుంగుతున్న తయారీ రంగం, పెట్టుబడులను వెనక్కు తీసుకుంటున్న ఇన్వెస్టర్లు, సంక్షోభంలో రైతాంగం, అంతర్జాతీయ సంక్షోభాలతో ఎదురవుతున్న ముప్పు.. వీటన్నిటినీ బ్జడెట్‌లో పట్టించు కోలేదు. ఇది తప్పులు సరిదిద్దుకోలేని బడ్జెట్, దేశంలోని వాస్తవ సంక్షోభాలను పట్టించుకోని బ్జడెట్' అని ఎక్స్ వేదికగా ఘాటు విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కూడా బడ్జెట్‌పై విమర్శలు ఎక్కుపెట్టింది. బడ్జెట్ నిస్సారంగా ఉందని కామెంట్ చేసింది. బడ్జెట్ మొత్తాన్ని ఇంకా చదవాల్సి ఉన్నప్పటికీ 90 నిమిషాల బడ్జెట్ ప్రసంగాన్ని గమనిస్తే ఇది అంచనాలను అసలేమాత్రం అందుకోలేదనే చెప్పాలి. పూర్తి నిస్సారంగా ఉంది. బ్జడెట్‌లో పారదర్శకత లోపించింది. ముఖ్య పథకాలు, కార్యక్రమాలకు నిధుల కేటాయింపుపై స్పష్టత లేదు' అని కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్ విమర్శించారు.

# స్థిరంగా భారతదేశ ఆర్థిక ప్రయాణం


(మొదటి పేజీ తరువాయి)

హైటెక్ టెక్నాలజీ రూమ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కంటైనర్ నిర్మాణ రంగానికి రూ.10 వేల కోట్లు, దేశంలో కొత్తగా మూడు కెమికల్ రీసెర్చ్ పార్కులు, సెమీకండక్టర్ మిషన్ కోసం రూ.40 వేల కోట్లు, జౌళి రంగానికి కేంద్ర బ్జడెట్‌లో చేయూతనివ్వడంతో పాటు మెగా టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణం చేపడుతామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. సెమీ కండక్టర్ మిషన్ 2.క్ష ప్రారంభిస్తామని, త్వరలో నేషనల్ ÷బైర్ స్కీమ్ ప్రారంభం, టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి కొత్త పథకం, దేశంలో కొత్త మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు చేయడంతో పాటు ఖాదీ, హ్యాండ్లూమ్, హస్తకళల ప్రోత్సాహానికి పథకం ఏర్పాటు చేస్తామని, అత్యంత నాణ్యత కలిగిన క్రీడా వస్తువుల తయారీకి పథకం ఉంటుందని, 200 పారిశ్రామిక క్లస్టర్స్ ఆధునీకరణకు చేయూతనిస్తా మన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌కు రూ.2 వేల కోట్లు కేటాయించడంతో పాటు ఎస్ఎంఇ రంగానికి రూ.10 వేల కోట్లు ఇస్తామని, మైక్రో సెక్టార్‌కు రూ.2 వేల కోట్లు ఇస్తామని, ఆత్మనిర్భర్ భారత్‌కు రూ.2 వేల కోట్లు ఇస్తామని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. నగరాలే దేశ గ్రోత్ ఇంజిన్లు అని, రెండో, మూడో స్థాయి నగరాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, పాట్నా, వారణాసిల్లో షిప్ రిపేర్ ఎకోసిస్టమ్, ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్ల అభివృద్ధితో పాటు ముంబై-పుణెళి, పుణెళి-హైదరాబాద్, హైదరాబాద్- చెన్నై రూట్లలో హైస్పీడ్ రైల్ కారిడార్లు నిర్మించడంతో పాటు ఢిల్లీ- వారణాసి, వారణాసి- సిలిగురి మార్గాల్లో హైస్పీడ్ రైల్ కారిడార్ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని దేశంలో ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంచి సుస్థితర ఆర్థికాభివృద్ధి సాధించడం. మొదటి కర్తవ్యంలో భాగంగా ఈ ఆరు రంగాల్లో సుస్థిర అభివృద్ధి సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. ఏడు వ్యూహాత్మక, నిర్దేశిత రంగాల్లో ఉత్పాదతక ను వేగవంతం చేయడం, పారిశ్రామిక రంగాన్ని పునరుజ్జీవింపజేయడం వంటివి ప్రధానంగా ప్రస్తావించారు. వికసిత్ భారత్ థీమ్‌గా బడ్జెట్ ఉందన్నారు. సంస్కరణల ఎక్స్‌ప్రెస్ మాదిరిగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఉపాధి, వృద్ధిని ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం ఎంతో చేసిందని నిర్మలా సీతారామన్ అన్నారు. 2025లో 350కి పైగా సంస్కరణలు ప్రారంభించినట్లు చెప్పారు.కొన్ని వస్తువులకు పన్నుల మినహాయింపులు, తగ్గింపును ప్రకటించారు. దీంతో పలు వస్తువుల ధరలు తగ్గనున్నాయి. మరికొన్ని వస్తువుల ధరలు మాత్రం మరింత పెరగనున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనకు బలమైన ఊతం. దీర్ఘకాలిక ఇంధన భద్రత, స్థిరత్వం వంటివి ప్రతిపాదించారు. టెక్ టూల్ రూమ్స్ ఏర్పాటు, పరిశ్రమలకు విద్యాసంస్థల అనుసంధానం

మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు. 5 సూత్రాలతో ప్రత్యేక కార్యక్రమం. టెక్స్‌టైల్ రంగం కోసం వచ్చే ఐదేళ్లకు రూ.10వేల కోట్లు. జౌళి ఉత్పత్తుల అంతర్జాతీయ బ్రాండింగ్ కోసం ప్రత్యేక కార్యాచరణ రూ.10వేల కోట్లతో వచ్చే ఐదేళ్లకు బయో ఫార్మా శక్తి పథకం. ఫార్మా విద్య, పరిశోధనకు జాతీయ స్థాయిలో మూడు కొత్త విద్యా సంస్థల స్థాపన. రెడో కర్తవ్యం.. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు, వారి శక్తి సామర్థ్యాలను పెంపొందించి సుసంపన్న భారత్ దిశగా అడుగులు వేసేలా భాగం చేయడం. ఈ దిశగా ఇప్పటికే అడుగులు పడినట్లు తెలిపారు. గత పదేళ్ల కాలంలో దేశంలో స్థిరమైన ప్రభుత్వం, సంస్కరణల కారణంగా సుమారు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడించారు.

ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో మెడికల్ టూరిజం సర్వీసులు. ఐదు రీజినల్ మెడికల్ హబ్స్ ఏర్పాటు. ఆయుష్ కేంద్రాల అప్‌గ్రేడేషన్, సంప్రదాయ వైద్య పరిశోధనకు జామ్‌నగర్‌లో పరిశోధన కేంద్రం ఏర్పాటు. ప్రైవేటు రంగంలో పశువైద్య, దయాగ్నస్టిక్స్ ఏర్పాటుకు ప్రోత్సాహం. యువత కోసం వైద్య రంగంలో కొత్త కోర్సుల ఏర్పాటు. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్ రంగాలకు చేయూత. నేషనల్ డిజిటల్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు. ఖేలో ఇండియా మిషన్‌లో భాగంగా క్రీడాభివృద్ధి. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ విజన్‌తో దేశంలోని ప్రతి కుటుంబం, వర్గం, మతం, రంగానికి వనరులు, సదుపాయాలు, అవకాశాలను అందిస్తూ అభివృద్ధిలో అర్థవంతమైన భాగస్వాములుగా చేయడం. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం.

దివ్యాంగుల కోసం దివ్యాంజన్ కౌశల్ యోజన, దివ్యాంగ్ సహకార యోజన. మానసిక వ్యాధుల చికిత్సకు రాంచీ, తేజ్‌పూర్‌లలో నేషనల్ మెంటల్ హెల్త్ ఇనిస్టిట్యూట్ అప్‌గ్రేడేషన్. భారత్ విస్తార్ (వర్చువల్ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ టు యాక్సిస్ అగ్రికల్చర్ రిసోర్స్) వ్యవసాయ రంగానికి కృత్రిమ మేధను అనుసంధానం చేయడం ద్వారా ఉత్పత్తి పెంపు, మదింపు చేసి, రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకునేలా ప్రోత్స హించడం తూర్పు ప్రాంతంలోని 5 పూర్వోదయ రాష్ట్రాల పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, ఇందు కోసం 4వేల ఇ-బస్‌ల అందించటం. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, అస్సాం, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో బుద్ధిస్ట్ సర్క్యూట్ అభివృద్ధి.మొదటి రెండు కర్తవ్యాలు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తే, మూడో కర్తవ్యం ద్వారా 2047 నాటికి సమగ్రాభివృద్ధితో వికసిత్ భారత్‌గా మారడానికి మార్గాన్ని సుగమం చేస్తుందని బడ్జెట్ ప్రసంగం సందర్భంగా నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.



# రాష్ట్రాలను విస్మరించిన కేంద్ర బడ్జెట్

- కేరళ ఆచుర్వేద రంగానికి దక్కని ప్రోత్సాహకం
- కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ పెదవి విరుపు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(అక్షరగళం):** గత కొన్నేళ్లుగా చేస్తున్న బడ్జెట్ ప్రసంగాలలో ఇది చాలా చిన్నదిగా అనిపిస్తోంది. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వారి కోసం ప్రభుత్వం ఎటువంటి ప్రోత్సాహక చర్యలు తీసుకోలేదు. రాష్ట్రాలకు నిధులు కేటాయించలేదు. అసలు భవిష్యత్తులో కేంద్రం ఏమి చేయబోతోంది అనే విషయాలపై ఎటువంటి వివరాలు లేవు. కేరళలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కోసం 15 ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. దానిపై ఎటువంటి ప్రకటన రాలేదు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద స్థాపించనున్నట్లు మంత్రి చెప్పారు. కానీ ఎక్కడ ఏర్పాటు చేస్తారనే విషయంపై స్పష్టతనివ్వలేదు. ఈ బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని -కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు. ఎంపీ శశిథరూర్ పెదవి విరిచారు. ఒక మలయాళీగా తనకు బడ్జెట్ సంతృప్తి కలిగించలేదని అన్నారు. బడ్జెట్‌లో కేరళ ప్రస్తావనే లేకపోవడం తనను ఒకింత ఆశ్చర్యానికి గురి చేసిందని చెప్పారు. ఆయుర్వేదం, మత్స్యకారులు, కొబ్బరి తోటలు, షిప్ మరమ్మతులకు సంబంధించి బ్జడెట్‌లో ఎలాంటి ప్రస్తావనలు లేవన్నారు. కేరళకు సుదీర్ఘమైన ఆయుర్వేద చరిత్ర ఉందని, ఆయుర్వేద ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ కోసం తామంతా ఎదురుచూస్తున్నామని, కానీ ఆ ప్రస్తావనే బ్జడెట్‌లో లేకుండా పోయిందని శశిథరూర్ విమర్శించారు. కనీసం మత్స్యకారులు, కొబ్బరితోటల సంబంధించి ఏదైనా ప్రకటన ఉండొచ్చని ఆశించామని, అది కూడా లేదని అన్నారు. నౌకాశ్రయాల మరమ్మతుల ప్రస్తావన వచ్చినప్పుడు వారణాసి, పాట్నా పేర్లు చెప్పారే కానీ కేరళ ఊసే లేకపోవడం ఆశ్చర్య కలిగించిందని పేర్కొన్నారు. ఉద్యోగాల కల్పన అనేది మరోసారి జవాబులేని ప్రశ్నగా మిగిలిందని శశిథరూర్ అన్నారు. బ్జడెట్ ప్రసంగంలో దీనిపై మాట్లాడింది కూడా ఏమీ లేదన్నారు. గత కొన్నేళ్లుగా చేస్తున్న బ్జడెట్ ప్రసంగాలలో ఇది చాలా చిన్నదని చెప్పారు.

# కేంద్ర పన్నుల్లో వాటా కింద రాష్ట్రానికి పెరిగిన నిధులు

## కేంద్ర బడ్జెట్ ప్రకారం రూ.33,180.78 కోట్లు రాక

## ఆర్థిక సంఘం సిఫారసులతో రూ.1098.90 కోట్ల పెరుగుదల

## రాష్ట్రం హారిజాంటల్ వాటా 2.102 నుంచి 2.174 శాతానికి..

**హైదరాబాద్, ఫిబ్రవరి 1**

ఈసారి కేంద్ర ప్రభుత్వ పన్నుల వాటాలో రాష్ట్రానికి కాస్త ఊరట లభించింది. 16వ ఆర్థిక సంఘం చేసిన సిఫారసుల మేరకు ఆ వాటాలో పెరుగుదల కనిపిస్తోంది. రాష్ట్రానికి మొత్తం రూ.33,180.78 కోట్లు రానున్నాయి. రాష్ట్రాల నుంచి కేంద్రం వసూలు చేసే అన్ని రకాల పన్నుల మొత్తం నుంచి కొంతమేర తిరిగి పంచుతుంది. రాష్ట్రాలకు ఎంత శాతం నిధులు పంచాలో ఆర్థిక సంఘాలు సిఫారసు చేస్తాయి. వెర్టికల్‌గా పాత 41 శాతాన్నే కొనసాగించాలంటూ 16వ ఆర్థిక సంఘం సిఫారసు చేసింది. ఇది ఈ ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చి ఐదేళ్ల పాటు 2031 వరకు అమల్లో ఉంటుంది. ఈ 41 శాతాన్ని మళ్లీ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వివిధ అంశాల ఆధారంగా హారిజాంటల్‌గా పంచాల్సి ఉంటుంది. దీని కింద కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో మొత్తం రూ.15,26,255 కోట్లు కేటాయించింది. ఇందులో హారిజాంటల్ పంపక శాతం 2.174 ప్రకారం రాష్ట్రానికి రూ.33,180.78 కోట్లు రానున్నాయి. 2021-26 మధ్య కాలంలో అమల్లో ఉన్న 15వ ఆర్థిక సంఘం రాష్ట్రానికి 2.102 శాతాన్ని మాత్రమే సిఫారసు చేసింది. కానీ 16వ ఆర్థిక సంఘం దాన్ని 0.072 మేర పెంచి, 2.174 శాతంగా నిర్ధారించింది. 2.102 శాతం ప్రకారమైతే... రాష్ట్రానికి రూ.32,081.88 కోట్లు మాత్రమే వచ్చేవి. 0.072 శాతం పెరగడం వల్ల అదనంగా రూ.1,098.90 కోట్లు పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం విపత్తుల నిర్వహణ, పన్నుల వసూళ్లు, విద్యుత్తు సంస్కరణలు వంటి వాటిలో మెరుగైన ఫలితాలు సాధించడంతో 16వ ఆర్థిక సంఘం పన్నుల వాటా శాతాన్ని 0.072 మేర పెంచింది. దీంతో కేంద్ర పన్నుల్లో వాటా కింద మొత్తం రూ.33,180.78 కోట్లు సమకూరడం రాష్ట్రానికి కాస్త ఉపశమనమే. కాగా.. 2025-26లో కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.29,899 కోట్లు రావాలి. కానీ నికరంగా రూ.21,195.18 కోట్లు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పొందుపర్చింది. డిసెంబరు నాటికి రూ.14,982.82 కోట్లు (70.69?) విడుదలయ్యాయి.



2025-26లో అంచనా వేసిన రూ.29,899 కోట్ల కంటే ఈ తాజా బడ్జెట్‌లో వస్తాయని అనుకుంటున్న రూ.33,180.78 కోట్లను పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రానికి ఈసారి రూ.3,281.78 కోట్లు పెరిగినట్లే.

# మహిళలు, యువత, రైతులకు వ్యతిరేకం

(మొదటి పేజీ తరువాయి)

తప్పుదారి పట్టించిందని, బెంగాల్‌కు రావాల్సిన నిధుల వాటాను నిలిపివేసిందని అన్నారు. ప్రజలకు నేరుగా ప్రయోజనాలు చేకూర్చడానికి బదులుగా కొత్త ఆర్థిక కారిడార్ల పేరుతో పచ్చి అబద్దాలు చెబుతోందని, మాటల గారడీకి పాల్పడిందని తప్పుపట్టారు. బడ్జెట్‌లో కేంద్రం ప్రస్తావించిన ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇప్పటికే చేపట్టామని, మూడు కారిడార్లంటూ కేంద్రం చెబుతున్నవన్నీ అబద్ధాలేనని అన్నారు. పురులియాలో జంగల్ మహల్ జంగల్ సుందరి ప్రాజెక్టును మమతా బెనర్జీ ప్రస్తావిస్తూ, కేంద్రం నుంచి సపోర్ట్ లేకుండానే ఈ ఎకనామిక్ కారిడార్‌ను రూ.72,000 కోట్ల పెట్టుబడితో ఎలాన్ చేశామని తెలిపారు. బెంగాల్ నుంచి పెద్దమొత్తంలో పన్నులను కేంద్రం వసూలు చేస్తూ రాష్ట్రానికి ఇవ్వాల్సిన బకాయిలు విడుదల చేయడంలో మాత్రం విఫలమైందని టీఎంసీ అధినేత్రి ఆరోపించారు.

'బెంగాల్‌కు వాళ్లు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. జీఎస్టీ అంటూ వాళు మా సొమ్ములు తీసుకుంటూ మాకు డబ్బులు ఇస్తున్నట్టుగా చాలా పెద్ద మాటలు చెబుతున్నారు. అది ముమ్మాటికీ మా సొమ్మే' అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పశ్చిమ బెంగాల్‌కు రూ.2 లక్షల కోట్లకు పైగా బకాయిలు రావాల్సి ఉన్నాయని, తమకు న్యాయబద్ధంగా రావాల్సిన నిధులను కేంద్రం నిలిపివేసిందని చెప్పారు. దేశ ఆర్థిక, రాజ్యాంగబద్ధ, సమాఖ్య వ్యవస్థను కేంద్రం ధ్వంసం చేస్తోందని, ఈ రకంగా ప్రభుత్వాన్ని నడిపే నైతిక అధికారాన్ని కేంద్రం కోల్పోయిందని మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు.

# వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

వెచ్చిస్తారు. రాబోయే రెండేళ్లలో పలు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ప్రస్తుతం రెండో విడత ఎస్ఐఆర్ పక్రియ కొనసాగుతోంది. ఈ పక్రియలో అధికార బీజేపీతో ఎన్నికల సంఘం కుమ్మక్కై పెద్దఎత్తున ఓటర్లను తొలగిస్తున్నారంటూ విపక్షాలు ఆరోపణలు గుప్పిస్తున్న నేపథ్యంలో ఈసీకి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు 25 శాతం పెరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఏడాది తమిళనాడు, పశ్చిమబెంగాల్, అస్సాం, కేరళ రాష్ట్రాల్లోఅసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, 2027లో ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లో ఎన్నికలు ఉంటాయి. ఎన్నికల కమిషన్‌కు కేంద్రం కేటాయించిన నిధులను సాంకేతికత, ఎన్నికల నిర్వహణ, ఓటర్ల అవగాహన తదితర కార్యక్రమాల కోసం వినియోగిస్తారు. ఈవీఎంలు, వీవీపాట్ యంత్రాల ఆధునీకరణ, పోలింగ్ కేంద్రాల భద్రతకు కూడా ఈ నిధులు వెచ్చిస్తారు.

# తెలంగాణకు నిరాశ మిగిల్చిన బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులను కలిసినా సాయం అందలేదన్నారు. రామప్ప దేవాలయాన్ని యునెస్కో గుర్తించినా...టూరిజం విషయంలో కూడా రాష్ట్రానికి నిధులు కేటాయింపు జరగలేదన్నారు. సమ్మక్క సారలమ్మ దర్శనానికి న్యూజిలాండ్ ట్రైబ్స్ కూడా వచ్చారని.. కానీ, కేంద్రం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. బ్జడెట్‌లో జరిగిన అన్యాయంపై రాజకీయాలకు అతీతంగా.. రాష్ట్రంలోని ఎంపీలు అందరూ కలిసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని పేర్కొన్నారు.

# దేశ ఆర్థిక వ్యవస్థను సుస్థిరం చేసేలా బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

33 జిల్లాలకు బాలికల హాస్టళ్లు మంజూరు అవుతాయి. డేటా సెంటర్లకు ఉపయోగపడే నిర్ణయాన్ని మోదీ సర్కారు తీసుకుంది. డేటా సెంటర్లకు ఇచ్చే ప్రోత్సాహం వల్ల తెలంగాణకూ లాభం. విదేశీ విద్య కోసం వెళ్లే విద్యార్థులపై ఉండే పన్నును 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించారు. విదేశీ విద్యపై పన్ను తగ్గించటం వల్ల తెలుగు విద్యార్థులకు ఎంతో మేలు. రైల్వే బ్జడెట్‌ను రూ. 2.77 లక్షల కోట్లకు పెంచింది. రాష్ట్రానికి మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయి. మెట్రో రైలు గురించి ప్రత్యేకంగా బ్జడెట్‌లో ఉండదు. మెట్రోపై డీపీఆర్ ఇస్తే.. పట్టణాభివృద్ధి శాఖ నిధులు ఇస్తుంది. మెట్రో రైలు ప్రాజెక్టుకు మంత్రివర్గ ఆమోదంతో నిధులు వస్తాయి. ప్రస్తుత మెట్రో ప్రాజెక్టు టేకోవర్ పక్రియ పూర్తి చేసి డీపీఆర్ ఇస్తే కేంద్రం ఆమోదిస్తుంది. దేశంలో ఉపాధి అవకాశాలు పెంచేలా మోదీ సర్కారు చర్యలు చేపట్టిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ అధికారులు విచారిస్తోన్న సంగతి తెలిసిందే. దానిపై మీడియా అడిగిన ప్రశ్నకు కిషన్ రెడ్డి స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు టీవీ సీరియల్ మాదిరిగా కొనసాగుతోంది. ఇప్పటికే రెండేళ్లయ్యింది. ఇంకా ఎన్నాళ్లు సాగుతుందో తెలియదు. ఫోన్ ట్యాపింగ్ నిజమని స్వయంగా కేసీఆర్ కుమార్తె చెప్పారు. ఇంటి అల్లుడి ఫోన్ ట్యాప్ చేశారని స్వయంగా కవిత చెప్పారు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com

అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం



# తెలంగాణ రౌండప్

## ఆర్థిక సహాయం అందజేసిన గౌడ సంఘం నాయకులు



**ఆమనగల్లు, ఫిబ్రవరి 01 (అక్షర గళం):** కడ్తాల్ మండలం చరికొండ గ్రామానికి చెందిన వల్లపుదాసు వెంకటేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం అతని దశాదిన కర్మ సందర్భంగా గ్రామ గౌడ సంఘం నాయకులు మృతుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. గౌడ సంఘం అధ్వర్యంలో 90 వేల రూపాయలు సమకూర్చి మృతుడి తల్లీ కు అందజేశారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ పాలకుర్ల మహేందర్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు లాల్ కోట రాములు తదితరులు ఉన్నారు.



## కాంగ్రెస్ విజయానికి సైనికుల్లా పని చేయాలి

**- మంత్రి జూపల్లి కృష్ణారావు**

**ఆమనగల్లు, ఫిబ్రవరి 01 (అక్షర గళం):** మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. ఆదివారం పట్టణ కేంద్రం లోని ఫుడ్ లాండ్ రెస్టారెంట్ వద్ద ఆయనను మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి రెండు సంవత్సరాల్లోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు.

కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ, మహిళ లకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్లలోపు వారికి ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు రుణమాఫీ వంటి పథకాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, నాయకులు అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ అలీమ్, కరీం, అంజాత్, తయ్యాబ్, నర్సింహా, వంశీ తదితరులు ఉన్నారు.



## ఎన్నికల హామీలు అమలు చేయని కాంగ్రెస్

**- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్**

**ఆమనగల్లు, ఫిబ్రవరి 01 (అక్షర గళం):** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, గిడ్డంగుల శాఖ మాజీ చైర్మన్, ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జీ రజిత సాయిచంద్ విమర్శించారు. మున్సిపాలిటీలోని 9వ వార్డుల్లో అభ్యర్థి సయ్యద్ ఖలీల్ తో కలిసి శనివారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్పు అంటూ ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రాభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి మార్పు తీసుకురాలేదన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నిక ల్లో అన్ని వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అర్జున్ రావు, మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, పాపిశెట్టి రాము, గుత్తి బాలస్వామి, మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్, సైదులు గౌడ్, ఉప్పల రాములు, కోట శ్రీను, చలిచీమల సతీష్, జంతుక కిరణ్, రమేష్ నాయక్, మహేష్, జహంగీర్, అహ్మద్ తదితరులు ఉన్నారు.



## ఆర్థిక సహాయం అందించిన ఎల్ఎన్ రెడ్డి

**ఆమనగల్లు, ఫిబ్రవరి 01 (అక్షర గళం):** కడ్తాల మండలం చరికొండ గ్రామానికి చెందిన వల్లపుదాసు వెంకటేష్ గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి ఆదివారం మృతుడు వెంకటేష్ సంతాప కార్యక్రమానికి హాజరయ్యారు. స్థానిక బీఆర్ఎస్ నేతలతో కలిసి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, మృతుడి కుటుంబానికి 5,000/- ఆర్థిక సహాయం అందజేశారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాలకు తావివ్వకుండా ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ ఉంటామని, సమాజ శ్రేయస్సే తమ ధ్యేయమని, మండల పరిధిలో ఎవరికి ఏ ఆపద వచ్చినా మేమున్నామని బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మర్రిపల్లి మాజీ సర్పంచ్ భారతమ్మ నర్సింహ్మా, బాగ్యమ్మ జంగయ్య, నాయకులు లాల్ కోట జంగయ్య, భీష్మా చారి, మూడ అశోక్ కుమార్, సాబెర్ వార్డు సభ్యులు వెంకటయ్య గౌడ్, జల్ల రాములు, నర్సింహ్మా, సాప మహేష్, సాప వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## సిట్ విచారణ పేరుతో కేసీఆర్‌పై వేధింపులు అప్రజాస్వామికం

**రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



**కల్వకుర్తిఫిబ్రవరి1(అక్షరగళం):** తెలంగాణ తెచ్చిన నాయకుడిపై కక్ష సాధింపుకు రేవంత్ ప్రభుత్వం దిగజారింది.

గోలి శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం సిట్ విచారణ పేరిట బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) గారిని వేధించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్, గోలి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని వెల్దండ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడిపై రాజకీయ కక్షతో చర్యలకు పాల్పడటం రేవంత్ రెడ్డి ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు.

కేసీఆర్ సిట్ విచారణకు హాజరుకానున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. తెలంగాణ అంతటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను తగలబెట్టడంతో పాటు, నియోజకవర్గ స్థాయిలో భారీ ఎత్తున బైక్ ర్యాలీలు నిర్వహిస్తూ ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. కేసీఆర్‌కు మద్దతుగా, రేవంత్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో రాష్ట్రం మార్మోగింది.

ఈ నేపథ్యంలో వెల్దండా మండల కేంద్రంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో గోలి శ్రీనివాస్ రెడ్డి రేవంత్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.తెలంగాణ కోసం తన జీవితాన్నే అర్పించిన నాయకుడు కేసీఆర్ అని అలాంటి వ్యక్తిపై సిట్ విచారణ పేరుతో వేధింపులకు దిగడం అంటే తెలంగాణ ప్రజల మనోభావాలను అవమానించడమే అని ఆయన స్పష్టం చేశారు.ప్రజా సమస్యలు పక్కనపెట్టి ప్రతిపక్షాలను అణిచివేయడమే లక్ష్యంగా రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే నియంతృత్వ పోకడలు ప్రదర్శిస్తూ, ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకోవడం చరిత్రలో చెడ్డ ఉదాహరణగా మిగిలిపోతుందని హెచ్చరించారు.

కేసీఆర్‌పై ఎలాంటి అక్రమ అన్యాయ చర్యలకు పాల్పడినా బీఆర్ఎస్ పార్టీతో పాటు తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరని గోలి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఇది కేసీఆర్ వ్యక్తిగత అంశం కాదని, తెలంగాణ ఆత్మగౌరవానికి సంబంధించిన పోరాటమని అన్నారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమని ఆయన గట్టి హెచ్చరిక చేశారు.మొత్తంగా సిట్ విచారణ పేరిట ప్రారంభమైన ఈ రాజకీయ కక్ష సాధింపు తెలంగాణ రాజకీయాలను ప్రమాదకర మలుపు తిప్పుతోందని, రేవంత్ ప్రభుత్వం తన వైఖరిని తక్షణమే మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని గోలి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, జిల్లా నాయకులు నాగులు నాయక్,మాజీ సర్పంచ్ అంజి నాయక్,వార్డు సభ్యులు సునీత ఆనంద్,మాజీ ఎంపీటీసీ హన్మంతు,మాజీ ఎంపీటీసీ లింగం, ఉప సర్పంచ్ అల్వాల్ యాదవ్, అంజి మాస్టర్, అశోక్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.





## కేసీఆర్‌ను దేశం పొగుడుతుంటే ప్రభుత్వం అవమానిస్తోంది

**● రజని సాయిచంద్**

**ఆమనగల్లు, ఫిబ్రవరి 01 (అక్షర గళం):** దేశవ్యాప్తంగా కేసీఆర్ పాలనను కొనియాడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం విచారణ పేరిట ఆయనను అవమానిస్తోందని గిడ్డంకుల శాఖ మాజీ చైర్మన్, ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జీ రజని సాయిచంద్ మండిపడ్డారు. కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆదివారం పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి బైక్ చేపట్టారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ శ్రేణులను భయ భ్రాంతులకు గురిచేసేందుకే ఇలాంటి రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని ధ్వజమెత్తారు. ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అర్జున్ రావు, సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి, మాజీ ఎంపీటీసీ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్, మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం, మంచుకొండ జగదీష్, సైదులు గౌడ్, కొమ్ము ప్రసాద్, వరికుప్పల గణేష్, గుజ్జరి గోపి,శంకర్, పరమేష్, నిరంజన్, శివ, రమేష్, సాలయ్య, పూసల భాస్కర్ తదితరులు ఉన్నారు.

### కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కొత్త డ్రామా

**- మండల అధ్యక్షుడు అర్జున్ రావు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు ఏళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పొనుగోటి అర్జున్ రావు ధ్వజమెత్తారు.

ఆదివారం మండల పరిధిలోని కోనాపూర్ గేట్ హైద్రాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై నిరసన తెలిపి సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా అర్జున్ రావు మాట్లాడుతూ.. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రభుత్వం కొత్త డ్రామాలకు తెరలేపిందని, అందులో భాగంగానే మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ పేరిట నోటీసులు ఇవ్వడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేంతవరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుమార్, మండల జనరల్ సెక్రెటరీ గండికోట శంకర్, ఉపాధ్యక్షుడు దొడ్డి పరమేష్, ఉపసర్పంచ్ కుమార్, ప్రశాంత్, రైసల్, శేఖర్, లక్ష్మణ్, జంగయ్య, రూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలిన బిఆర్ఎస్

- అధినేత కేసీఆర్‌పై సిట్ పేరుతో అక్రమ కేసులు
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్కు ప్రజలు గుణపాఠం చెపుతారు
- టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్లతో నిరసన రాలి
- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**కల్వకుర్తి ఫిబ్రవరి 1 (అక్షర గళం):** రాష్ట్రంలో అడ్డగోలు హామీలతో ఆరు గారెంటీలు 420 అమలు కానీ హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ పై సిట్ విచారణ పేరుతో నోటీసులు జారీ చేయడం సరికాదని ప్రజా సమస్యలను దృష్టి మళ్లించేందుకే కెసిఆర్ కు సిట్ నోటీసులు జారీ చేశారని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కు సెట్ నోటీసులను జారీ చేయడం నిరసిస్తూ ఆదివారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో జైపాల్ యాదవ్ అన్నారు అనంతరం పాలమూరు చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కెసిఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేశారని విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతుందని అడ్డగోలుగా ముఖ్యమంత్రి మంత్రులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు ప్రజాస్వామ్యసాలను పట్టించుకోని ఈ ప్రభుత్వానికి రాష్ట్రవ్యాప్తంగా జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడమ సత్యం పట్టణ అధ్యక్షుడు భావండ్ల మధు తలసాని జనార్దన్ రెడ్డి సూర్యప్రకాశ్రావు మనోహర్ రెడ్డి ఖాదర్ భోగి రెడ్డి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు దిన పత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
నిజం..నిర్భయంగా
## గ్రేటర్ -హైదరాబాద్






## ఘనంగా లయన్ విష్ణువర్ధన్ రెడ్డి
# జన్మదిన వేడుకలు

**అక్షర గళం, కుత్బుల్లాపూర్:** సంఘ సేవకులు, ఏఆర్కే ఫ్యాబ్ టెక్ అదినేత లయన్ విష్ణువర్ధన్ రెడ్డి 43 జన్మదిన వేడుకలను ఆదివారం లయన్ క్లబ్ ఆర్యా ఆధ్వర్యంలో నగరంలోని ఎర్రగడ్డ సమీపంలోని ఈ.ఎస్.ఐ. ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఘనంగా జరుపు కున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డి.ఎస్.పి నాగేశ్వర్ రావు,శ్రీ రాజలక్ష్మి ఇండస్ట్రీస్ అదినేత,లయన్ క్లబ్ ఆఫ్ ఆర్య గాంధినగర్ వ్యవస్థాపకులు,సాహిత్య కళా పోషకులు లయన్ డాక్టర్.చిల్లా రాజశేఖర్ రెడ్డి లు హజరై రోగులకు పండ్లు పంపిణీ చేసిన అనంతరం బంధుమిత్రుల సమక్షంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ పెద్ద మనసుతో నిరుపేదల కడుపు నింపుతూ సమాజసేవలో తనవంతు కృషి చేస్తున్న విష్ణువర్ధన్ రెడ్డిని అభినందిస్తూ శాలువా తో సన్మానించి,లయన్స్ సేవలో మీ జీవితం కొనసాగాలని నిండునూరేళ్లు వర్ధిల్లాలని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గురుస్వామి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అమ్మానాన్నలాంటి పెద్దలకు నాచేతితో వడ్డించి అన్నదానం చేయటం గొప్ప అదృష్టంగా బావిస్తున్నాని సంతోషం వ్యక్తపరిచారు. అభినవ కవి,మానస టూల్ టెక్ అధినేత వాకిటి రామ్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలో ఎన్నో అనుబావాలను నేర్చుకుంటూ,స్వయం కృషితో జీవిస్తూ, యువతరానికి స్పూర్తిగా నిలిచిన విష్ణువర్ధన్ రెడ్డిని నిండు మనసుతో దీవించి తాను లిఖించిన కవిత ను మధురంగా పాటగా పాడి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్ క్లబ్ ప్రతినిధులు పెద్దలు ఆదిరెడ్డి,రాజేంద్ర ప్రసాద్,అడ్వకేట్ రఘువేందర్ రావు,రాఘవ రెడ్డి,ఎల్లా సుబ్బా రెడ్డి,రమణా రెడ్డి,హేమాద్రి నాయుడు,రంజిత్ కుమార్,జింకల వెంకటేశ్, బి.వి.సూర్యనారాయణ, సఫి,కుటుంబ సబ్యులు పాల్గొన్నారు.

## శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో పౌర్ణమి వేడుకలు



**అక్షరగళం, కుత్బుల్లాపూర్:** పౌర్ణమి సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూం నగర్ లో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో బీఆర్ఎస్ యువజన నాయకులు కొలుకుల జైహింద్ కుటుంబ సమేతంగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి కృప కటాక్షాలతో జగద్గిరిగుట్ట డివిజన్ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో. ఆలయ కమిటీ అధ్యక్షులు. సుజిత్ కుమార్. వైస్ ప్రెసిడెంట్. రాజు. కమిటీ సభ్యులు. రాములు భాస్కర్ దినేష్ విటల్ కిషన్ నాగేష్. విట్టల్ గౌడ్, సాయిలు యాదవ్.రాజు తదితరులు పాల్గొన్నారు







# విద్యార్థులు విద్యలో మంచి ఫలితాలు సాధించాలి

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**అక్షరగళం,కుత్బుల్లాపూర్:** విద్యార్థులు విద్యలో మంచి ఫలితాలు సాధించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం పరిధిలోని చంద్రగిరి నగర్ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ సక్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక సాంస్కృతిక కార్నివల్‌కు పాఠశాల చైర్మన్ నవాబ్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంలో ఆయన పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను అభినందించి విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో ఇలాంటి కార్యక్ర మాల ప్రాముఖ్యతను వివరించారు. విద్య, క్రీడలు, కళలలో విద్యార్థుల నైపుణ్యాలను ప్రశంసిస్తూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం కలిసే సమన్వయం విద్యార్థుల భవిష్యత్తును ప్రకాశవంతం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోల సంజీవ్ రెడ్డి, ఎండీ లాయక్, కొలన్ జీవన్ రెడ్డి, మైసిగారి శ్రీనివాస్, గఫ్ఫార్, రహీం ఖాన్,పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ వీడి బిఆర్ఎస్‌లో చేరిక

**కల్వకుర్తి ఫిబ్రవరి 1 (అక్షర గళం):** కల్వకుర్తి పట్టణానికి చెందిన టీఎన్జీవో నాయకులు ఏదుల ఆనంద్ కుమార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామ చేసి ఆదివారం పదవ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాజీ మున్సిపల్ ఎడమ సత్యం సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భావనల మధు మాజీ కౌన్సిలర్ తాహెర్ అలీ పిఏసిఎస్ మాజీ చైర్మన్ తలసాని జనార్దన్ రెడ్డి బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.







# కెసిఆర్‌కు హాని తల పెడితే రాష్ట్రం అగ్నిగుండమే

**రాజకీయ కక్ష సాధింపుతోనే సిట్ నోటీసులు**

**పరిపాలన గాలికి వదిలేసి**

**రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారు**

**బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ**

**మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**కల్వకుర్తి ఫిబ్రవరి 1 (అక్షర గళం):** ఉద్యమకారుడు బిఆర్ఎస్ అధినేత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చావు నోట్లో తెలంగాణ రాష్ట్రాన్ని సిద్ధించిన గొప్ప నాయకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై రాజకీయ కక్షతో ఆధారాలు లేని ఫోన్ టాపింగ్ అక్రమ కేసులో సిట్ నోటీసులు ఇచ్చి విచారణ పిలవడంపై బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసనను ప్రకటిస్తూ నల్ల కండువాలను వేసుకొని తలకొండపల్లి మండల కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు తెలియజేస్తూ సీఎం దిష్టిబొమ్మను దగ్ధం చేసి భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు అనంతరం ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పై కేసులు పెట్టి జైల్లో పెట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఇంటరాగేషన్ పేరుతో పోలీసులు హింసిస్తున్నారని నాన్న బూతు మాటలు తిడుతున్నారని ఆవేశాన్ని వ్యక్తపరిచారు మాయ మాటలతో ఆరు గ్యారెంటీల హామీతలతో అధికారంతో వచ్చిన ప్రభుత్వం దమ్ముంటే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



కెసిఆర్‌ను తిట్టడం కాదని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ను కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఏ శక్తి ఏం చేయలేదని ఖబర్దార్ తెలంగాణ ప్రభుత్వం అంటూ నినాదాలతో హోరెత్తించారు.

కెసిఆర్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉప సవరించాలని డిమాండ్ ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విస్డం దా స్కూల్లో ఫుడ్ ఫెస్టివల్ వేడుకలు

## నైపుణ్యాన్ని ప్రదర్శించిన విద్యార్థి విద్యార్థినిలు

**కల్వకుర్తి ఫిబ్రవరి 1 (అక్షర గళం):** విజ్డం ద స్కూల్లో ఫుడ్ ఫెస్టివల్ వేడుకలను విద్యార్థి విద్యార్థినులు శనివారం ఘనంగా జరుపుకున్నారు పాఠశాల ఆవరణలో టెంట్లు వేసి స్టాల్స్ ను ఏర్పాటు ఆయా రకాల జ్యూసులు స్నాక్స్ విద్యార్థిని విద్యార్థులు వండి ఏర్పాటుచేసిన స్టాల్స్‌లో రకరకాల వంటకాలను ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులకు విక్రయాలను చేశారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సింధు మాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యతను విద్యతోపాటు అన్ని వాటిలో అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో ఫోర్త్ క్లాస్ నుండి టెన్త్ క్లాస్ విద్యార్థిని విద్యార్థులు రుచికరమైన వంటలతో పాటు జ్యూస్‌లను తయారు చేసి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారని తెలిపారు. ఈ



కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154